క్లుప్తంగా

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి ఎం.వీరభద్రరావు, మంగతాయారు (అమలాపురం మండలం ఈదరపల్లి) రూ.25 వేలు, వి.రామకృష్ణ, సత్యవతి దంపతులు (తాళ్లరేవు) రూ.10,001 చొప్పున గురువారం విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఈ విషయం తెలిపారు. దాతలకు స్వామి వారి చిత్రపటాలను సిబ్బంది అందజేశారు.

చురుకుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



చెముడులంకలో వేగంగా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

ఆలమూరు: చెముడులంకలో రూ.20 లక్షలతో సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యాన డ్రైనేజీ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులతో స్థానిక ఎస్సీ పేటలో రూ.10 లక్షలు, కల్యాణ మండపం వీధిలో మరో రూ.10 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ఎస్సీ పేటలో డ్రైనేజీ సమస్య పూర్తిగా తొలగనుంది. డ్రైనేజీలో ఎటువంటి వ్యర్థాలూ వేయడానికి వీలు లేకుండా డ్రైనేజీపై బల్లలు వేస్తూ, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి యు.రేణుక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దేవి తదితరులు గురువారం పరిశీలించారు.


త్వరితగతిన భవన నిర్మాణాలు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: నాడు–నేడు పథకం రెండో విడతలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పాఠశాల అదనపు తరగతి భవన నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాడు – నేడు పథకంలో రూ.1.30 లక్షలతో 8 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామన్నారు. నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థులందరూ భోజనం తినేలా చూడాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు కేవీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న శేషశయన ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు.

కోతిపై కుక్కల దాడి



కోతికి చికిత్స చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

మామిడికుదురు: స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ఓ కోతిపై గురువారం సాయంత్రం ఐదు కుక్కలు దాడి చేసి. తీవ్రంగా గాయపరిచాయి. దాడిని గమనించిన స్థానికులు కుక్కలను బెదరగొట్టి, స్థానికంగా ఉన్న పశు వైద్య శాఖ ఉద్యోగులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని గాయపడిన కోతికి ప్రథమ చికిత్స చేశారు. విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని, కోతికి చికిత్స అందిస్తున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్ పోస్టులు మూడు, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజికల్ ఎరెక్టర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 30 లోపు కళాశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 9505318704 నంబర్‌కు సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

రావమ్మా.. వరలక్ష్మీ



అంబాజీపేటలో పూల క్రయవిక్రయాలు



రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌లోని పూల దుకాణాల వద్ద శ్రావణ శోభ

- మార్కెట్‌కు వరలక్ష్మీ వ్రత శోభ
- కిక్కిరిసిన బంగారం, పూజా సామగ్రి దుకాణాలు
- పూల ధరలకు రెక్కలు

అంబాజీపేట/రావులపాలెం/ఆలమూరు: శ్రావణ శుక్రవారం.. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మార్కెట్లు గురువారం కొత్త శోభను సంతరించుకున్నాయి. ముఖ్యంగా పూజా సామగ్రి, వస్త్ర, బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. ఎక్కడ చూసినా మార్కెట్లు మహిళలతో సందడిగా కనిపించాయి. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. రెండో శుక్రవారానికి హిందూ సంప్రదాయంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆ రోజున వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తే సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని నమ్ముతారు. దీంతో రెండో శుక్రవారం వ్రతం చేసుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ నేపథ్యంలో పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులతో మార్కెట్లు కిక్కిరిశాయి. పూలు, పండ్లు, పత్రి, ఇతర పూజా సామగ్రి దుకాణాలు రద్దీగా మారాయి. లక్ష్మీ రూపులు, ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. కొంతమంది కొత్త వస్త్రాలు కూడా కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజా సామగ్రి అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్రధాన వాణిజ్య కేంద్రమైన రావులపాలెంతో పాటు కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం, రాజోలు తదితర అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్లలో వినియోగదారుల కోలాహలమే కనిపించింది. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ఆకాశాన్నంటిన పూల ధరలు

ఆషాఢ మాసంలో పూలు, పండ్ల ధరలు కొద్ది మేర దిగి వచ్చినా.. శ్రావణ మాసం ఆరంభంతో వీటి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. శ్రావణ మంగళ, శుక్రవారాల్లో మహిళలు ఆలయాలు, ఇళ్ల వద్ద పూజలు చేస్తూండటంతో వీటి గిరాకీ పెరిగింది. నిన్నటి వరకూ అంబాజీపేటలో మల్లె, చామంతి పూలు ఇంటింటికీ తిరిగి కిలో రూ.100కు విక్రయించేవారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా డిమాండ్ ఏర్పడటంతో పూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చామంతి పూలు కేజీ రూ.350 నుంచి రూ.400 వరకూ పలుకుతోంది. చిన్న పూలదండ రూ.60, కాస్త పెద్దది రూ.130 పలుకుతోంది. కేజీ విరజాజుల ధర రూ.3 వేలు, మల్లెలు రూ.3 వేలు ఉన్నాయని వ్యాపారులు చెప్పారు. మరోపక్క పండ్ల ధరలు కూడా పూలతో పోటీ పడ్డాయి. అరటి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష పండ్ల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. డజను అరటి పండ్లు రూ.50కి విక్రయించారు. కిలో ద్రాక్ష రూ.90 నుంచి రూ.100కు, యాపిల్, దానిమ్మ పండ్లు డజను రూ.300 నుంచి రూ.350కి విక్రయించారు. మరోపక్క తమలపాకులకు కూడా డిమాండ్ పెరిగింది. ఆలమూరులో కేజీ చామంతి పూలు రూ.600, కేజీ ముద్దబంతి పూలు రూ.200 చొప్పున పలికాయి.

గ్రామకంఠం భూముల సమస్య పరిష్కరిస్తాం

దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ హామీ



దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: పలివెల గ్రామంలో గ్రామకంఠం భూముల సమస్యకు మోక్షం కలగనుంది. ఆ గ్రామంలో 649 సర్వే నంబర్లలో 88 ఎకరాలు ఉండగా అందులో దేవదాయ శాఖ భూమి 2.52 ఎకరాలు కలిసింది. దీంతో మొత్తం 88 ఎకరాలను దేవదాయ శాఖ భూములుగా చూపించడంతో కొన్నేళ్లుగా పలివెల రెవెన్యూ గ్రామంలో 80 ఎకరాల భూమి, స్థలాలు రిజిస్ట్రేషన్ కాక జిరాయితీదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ద్వారా ఈ సమస్యను ఎంపీపీ మార్గన గంగాధరరావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే 88 ఎకరాలను సబ్ డివిజన్ చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఎంపీపీ గంగాధరరావులు గురువారం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ కలిసి ఈ సమస్యను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీపీ గంగాధరరావు విలేకర్లకు తెలిపారు.

సారా బట్టీలపై విస్తృత దాడులు



సారా బట్టీల వద్ద స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఆలమూరు: మడికి గ్రామం శివారున గుట్టు చప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన సారా బట్టీలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) జిల్లా టాస్క్‌ఫోర్స్ గురువారం దాడులు చేశారు. 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆలమూరు ఎస్ఈబీ ఎస్సై పి.రాంబాబు కథనం ప్రకారం.. మడికి శివారు చిలకలపాడులో సారా బట్టీ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ కె.వీరబాబు ఆధ్వర్యాన ఈ దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే వంట సామగ్రి, డ్రమ్ములను సీజ్ చేశారు. సారా తయారు చేస్తున్న చిలకలపాడుకు చెందిన రాయుడు సత్తిబాబును, కడియం మండలం దుళ్లకు చెందిన మిద్దె వీరబాబును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సత్తిబాబుపై ఇప్పటికే పీడీ యాక్టు నమోదై ఉండగా మరో ఐదు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. మరో నిందితుడు వీరబాబుపై కూడా సారా తయారీ కేసులు నమోదయ్యాయి. ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మిత్ర పురుగులను సంరక్షించుకోవాలి



నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయ్‌కుమార్

అంబాజీపేట: మిత్ర పురుగులను సంరక్షించుకోవడం వల్ల వరి పంటకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయా శాఖ పి.గన్నవరం సహాయ సంచాలకుడు (ఏడీఏ) ఎస్‌జేవీ రామ్మోహనరావు అన్నారు. మండల వ్యవసాయాధికారి (ఏఓ) సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఇరుసుమండ గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏఓ మాట్లాడుతూ, వరి పంటకు నష్టం చేసే పురుగుల నిష్పత్తిని బట్టి పురుగు మందుల వాడకాన్ని నిర్ణయించుకోవాలన్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడటం వల్ల పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని చెప్పారు. నీమాస్త్రంతో గుడ్డు దశలో ఉన్న పురుగులు, లద్దె పురుగుల ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. వేప నూనె, వేప గింజల కషాయం లేదా నీమాస్త్రం వాడటం వల్ల వరిలో పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏ ఎస్.కిరణ్‌దుర్గ, సొసైటీ డైరెక్టర్ దొమ్మేటి రాధా సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

జయహో ఇస్రో..

రావులపాలెం: చంద్రయాన్‌–3లో విజయం సాధించిన ఇస్రోకు మండలంలోని రావులపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం వినూత్న రీతిలో అభినందనలు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశమూ సాధించలేని ఘనతను ఇస్రో సాధించి భారత దేశ ప్రతిష్ఠను అగ్రస్థానంలో నిలబెట్టిందని పేర్కొంటూ.. ఆ సంస్థకు సెల్యూట్ చేస్తూ.. ఇస్రో ఆకృతిలో కూర్చుని అభినందనలు తెలిపారు. హెచ్ఎం జి.సునీత ఆధ్వర్యాన ఇంగ్లిష్ టీచర్ కేవీ శేఖర్ విద్యార్థులతో ఈ విన్యాసం చేయించారు.



ఇస్రో ఆకృతిలో కూర్చొని అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

విఘ్నేశ్వరుని ఆలయంలో నేడు వరలక్ష్మీ పూజలు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి సన్నిధిలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ గురువారం ఈ విషయం తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర కార్యక్రమాలపై చర్చించనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

రేపు జాబ్ మేళా

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాల భర్తీకి దివీస్ లేబరేటరీస్ ఈ మేళా నిర్వహిస్తోందన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ చదివిన విద్యార్థులు 2021 నుంచి 2023 మధ్య ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9:30 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో డిగ్రీ కళాశాలకు రావాలన్నారు.

టైలర్‌కు ఆర్థిక సాయం

మలికిపురం: అనారోగ్యంతో బాధ పడుతున్న మలికిపురం వాసి, టైలర్ మాలే వీరనాయుడుకు కువైట్‌లోని ఆదర్శ ఆంధ్రా యూత్ సంస్థ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. సంస్థ తరఫున వైఎస్సార్ సీపీ నాయకులు కేఎస్ఎన్ రాజు, గెద్దం తులసీ భాస్కరరావు చేతుల మీదుగా మలికిపురంలో గురువారం ఆర్థిక సాయం అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు మోకా నరసింహస్వామి, ఇంజేటి కృష్ణకుమార్ సహకారంతో ఈ సాయం అందజేశారు. తోటె ప్రతాప్, తాడి సమదేవ్, నల్లి రాజ్‌కుమార్, గెద్దం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానించాలి

మామిడికుదురు/రాజోలు/పి.గన్నవరం: విద్యుత్ వినియోగదారులు తమ పేరిట ఉన్న విద్యుత్ సర్వీసులకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ రాజోలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ శ్రీనివాసరావు, పి.గన్నవరం ఏఈ ఆనందరాజు సూచించారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, పి.గన్నవరం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించాలని కోరారు. లైన్‌మన్, ఏఈ కార్యాలయం, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి, బిల్లు కలెక్టర్ వద్ద ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లేదా గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా కూడా ఆధార్‌ను అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. దీనివలన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా పొందే అవకాశం ఉంటుంద డీఈఈ పేర్కొన్నారు.

చంద్రయాన్ విజయంపై ఆనందహేల



మామిడికుదురులో జాతీయ పతాకాలతో విద్యార్థుల ఆనందహేల



విశ్వేశ్వరాయపురంలో విద్యార్థుల విజయోత్సవం

మామిడికుదురు/మలికిపురం: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో మామిడికుదురు దీప్తి స్కూల్ విద్యార్థులు గురువారం విజయోత్సవం నిర్వహించారు. చంద్రయాన్‌–3 ప్రయోగం నమూనా చుట్టూ విద్యార్థులు జాతీయ పతకాలు పట్టుకుని జయహో భారత్.. జయహో ఇస్రో అంటూ నినదించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా చంద్రుని దక్షిణ ధృవంపై కాలు మోపడం ద్వారా మన దేశం చరిత్ర సృష్టించిందని విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ అన్నారు. ఈ విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ జక్కంపూడి వెంకటేశ్వరరావు, హెచ్ఎం యక్కలదేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో కూడా విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్, జై ఇస్రో అంటూ నినాదాలు చేశారు. కరస్పాండెంట్ పీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, వైఫల్యం నుంచే విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. చంద్రయాన్‌–3 ప్రయోగ విశేషాలను విద్యార్థులకు వివరించారు.

కేశఖండన కార్మికుల నిరసన

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి దేవస్థానంలోని కేశఖండన కార్మికులు జీఓ 110 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 37 ఏళ్లుగా 37 మందిమి ఇక్కడ కేశఖండన విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని, ప్రతి నెలా కనీస కమీషన్ రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో అమలు చేస్తున్నా ఇక్కడ మాత్రం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆలయ ఉద్యోగులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జీఓ విడుదలై నాలుగు నెలలవుతున్నా అమలు చేయలేదన్నారు. జీఓ అమలు చేయకుంటే శనివారం నుంచి విధులు బహిష్కరిస్తామని, కత్తి డౌన్ చేసి శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసనలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగ వీర వెంకట సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీర వెంకటదుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెం హైస్కూల్‌కు రెండోసారీ క్రీడా ప్రతిభా అవార్డు



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు

కాజులూరు: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన స్కూల్స్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన గొల్లపాలెం ప్రభుత్వ హైస్కూల్ వరుసగా రెండోసారి క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ప్రధానోపాధ్యాయిని ఎస్ఎస్‌బీ సుశీలామణి ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 5 పాఠశాలలు ఎంపికవగా, వీటిలో తమ పాఠశాల కూడా ఉందని తెలిపారు. ఈ ఏడాది 111 పాయింట్లతో తమ పాఠశాల జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్‌లో 19 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించారు. తద్వారా తమ పాఠశాల ఈ అవార్డుకు ఎంపికైందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, హెచ్ఎం సుశీలామణిని, పీడీ జి.సునీల్‌కుమార్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీపీ మాతా భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, సర్పంచ్ పి.ప్రసన్న మౌనిక, ఎంపీటీసీ సభ్యురాలు జె.సత్యపద్మజ, ఉప సర్పంచ్ టి.భువనేశ్వరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.నాగరాజు అభినందించారు.

ఈ-క్రాప్.. రైతు సేవలో భేష్

30 శాతం నమోదు
వచ్చే నెల 15 వరకూ గడువు



అంబాజీపేటలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ విజయ్‌కుమార్

అంబాజీపేట: అన్నదాత బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగు ప్రయోజనాలను సక్రమంగా అందించేందుకు ఈ-క్రాప్ విధానం ప్రవేశపెట్టారు. ఇది వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆరుగాలం శ్రమించే రైతులకు మరింత మేలు చేసే విధంగా రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కియోస్క్ ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీ విత్తనాలు బుక్ చేసుకున్న 48 గంటల్లో అందిస్తున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని అయినవిల్లి మండలంలో 8,186, అంబాజీపేట 3,095, పి.గన్నవరం 5,780, మామిడికుదురు 1,621, రాజోలు 820, సఖినేటిపల్లి 54, మలికిపురం 232, ఆత్రేయపురం 4,787, ఆలమూరు 9,900, రావులపాలెం 4,614, కొత్తపేటలో 7,813 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ అన్ని గ్రామాల్లోనూ 30 శాతం వరకూ ఈ క్రాప్ నమోదైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలెన్నో..

పంటల బీమా, గిట్టుబాటు ధర కల్పన, అందుబాటులో ఎరువులు, పురుగు మందులు, పెట్టుబడి సాయం అందించడం, వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు తదితర అనేక రైతు సంక్షేమ పథకాలకు ఈ-క్రాప్ నమోదు ఎంతో తోడ్పడుతోంది. ఈ-క్రాప్‌లో భాగంగా ఆర్‌బీకే స్థాయిలో ప్రతి రైతు వివరాలూ నమోదు చేస్తున్నారు. తద్వారా పంట అమ్ముకునే సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లుగా పంటల బీమాను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ-క్రాప్ కోసం రైతులు, కౌలు రైతులు తమ పేర్లను సంబంధిత ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలి. అనంతరం ఆయా ప్రాంతాల్లో పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి, ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ఈ-క్రాప్ నమోదుకు వచ్చే నెల 15వ తేదీ వరకూ గడువుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే రైతులు వీలైనంత త్వరగా తమ పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వలన పంట దెబ్బతింటే ఈ-క్రాప్ ఆధారంగానే నేరుగా సంబంధిత రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నష్టపరిహారం జమ చేస్తోంది. ఈ-క్రాప్ వలన ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు అందుతుంది. కాళ్లరిగేలా వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన బాధ ఉండదు.

– ఎంఎం శెట్టి, చైర్మన్, మండల వ్యవసాయ సలహా మండలి, అంబాజీపేట

రైతులకు ఎంతో మేలు



ప్రతి రైతూ తాను పండిస్తున్న పంట వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలి. వచ్చే నెల 15 వరకూ మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేస్తారు. రైతులు త్వరగా నమోదు చేయించుకోవాలి.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మామిడికుదురు: కరవాక గ్రామానికి చెందిన వివాహితను వేధిస్తున్న ఆరోపణలపై అదే గ్రామానికి చెందిన కొల్లు శ్రీనుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరం ఎస్సై పి.సురేష్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీను తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వాంఛ తీర్చమంటూ వేధిస్తున్నాడని వివాహిత ఫిర్యాదు చేసింది. దీనిపై పెద్దల సమక్షంలో గతంలో మందలించినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో శ్రీనుపై కేసు నమోదు చేసి, ర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

ఆబోతులను రక్షించిన నగరం వాసులు

మామిడికుదురు: నగరం గ్రామంలో పెట్రోల్ బంకు ఎదురుగా 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన బుధవారం రాత్రి రెండు ఆబోతులు పోట్లాడుకుంటూ డ్రైనేజీలో పడిపోయాయి. అక్కడి నుంచి బయట పడే మార్గం లేక అందులోనే చిక్కుకుపోయాయి. ప్రాణాపాయంలో ఉన్న ఆ ఆబోతులను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. మొదట తాళ్లతో బయటకు తీసేందుకు విఫలయత్నం చేశారు. దీంతో హైడ్రాలిక్ మెషీన్ సహాయంతో డ్రైనేజీపై ఉన్న సిమెంట్ మూతలను తొలగించారు. అనంతరం హైడ్రాలిక్ మెషీన్ సహాయంతో సుమారు గంట సేపు ప్రయత్నించి అతి కష్టం మీద రెండు ఆబోతులనూ రక్షించారు.